క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్య వ్రతాలు



సత్య వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం లోని సత్యసాయి మందిరం వద్ద సోమవారం సామూహిక సత్య వ్రతాలు నిర్వహించారు. సత్యసాయి మందిరం 26వ వార్షికోత్సవం సందర్భంగా సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 200 మంది భక్తులు పాల్గొన్నారు. కాకినాడకు చెందిన రఘుపతి మాస్టారు భక్తులతో సత్యవ్రతాలు చేయించారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు, జిల్లా ప్రతినిధులు త్రిమూర్తులు, ఘంటా హనుమంతరావు, రామలక్ష్మి పాల్గొన్నారు. బులుసు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా ఆధ్యాత్మిక జాయింట్ కో ఆర్డినేటర్‌గా కొల్లేపర లక్ష్మీపార్వతిని నియమించినట్లు ప్రకటించారు.

నేడు కంటి వైద్యశిబిరం

బిక్కవోలు: మెళ్లూరు గ్రామంలోని జీసస్ హోమ్ చర్చిలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని జాన్ డేవిస్ తెలిపారు. జీసస్ హోమ్ గాస్పల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ సిబ్బంది వైద్య సేవలు అందిస్తారన్నారు. మెళ్లూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

విద్యార్థులకు పురస్కారాలు



శ్రీఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీనును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాల విద్యార్థులకు శ్రీఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల హెచ్‌ఎం వీర ప్రభాకర్ మాట్లాడుతూ బిక్కవోలు శ్రీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె.శ్రీను 2023–24 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 24 విభాగాల్లో ఆరు నుంచి పదో తరగతి వరకూ చదివే విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారన్నారు. అలాగే పదో తరగతిలో మండల స్థాయిలో బహుమతులు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె.శ్రీనును ఘనంగా సత్కరించారు.

బాధ్యతల స్వీకరణ

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఏవోగా కుర్రెళ్ల సుబ్రహ్మణ్యం సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన, పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

54 పశువులకు వైద్యసేవలు

రంగంపేట: ముకుందవరంలో సోమవారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో 54 పశువులకు వైద్య సేవలు అందించారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం డిప్యూటీ డైరెక్టర్ మక్కెన వెంకటేశ్వరరావు సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి జహంగీర్, వడిశలేరు పశువైద్యాధికారి ఈ.జాన్‌పాల్, జి.దొంతమూరు జూనియర్ పశువైద్యాధికారి ఉమాదేవి, పశు వైద్య సహాయకులు రాణి, శివ, దుర్గాప్రసాద్, సురేష్, సత్యకుమార్, గోపాలమిత్ర శివ, రైతులు పాల్గొన్నారు.

సాయి సూర్యనారాయణకు సేవా పురస్కారం



సేవా పురస్కారం అందుకుంటున్న సాయి సూర్యనారాయణ

రంగంపేట: మండల పరిధిలోని ఈలకొలను హైస్కూల్ కాంప్లెక్స్ సీఆర్‌ఎంటీగా పనిచేస్తున్న జటప్రోలు సాయి సూర్యనారాయణకు జిల్లా సేవా పురస్కారం లభించింది. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త సుభాషిణి చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో ఏఎంఓ గౌరీశంకరరావు, సీఎంఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా.. పురస్కార గ్రహీత సాయి సూర్యనారాయణకు మండల విద్యాశాఖాధికారులు కె.శ్రీనివాసరావు, పి.మధుసూధనరావులు, సింగంపల్లి, రంగంపేట సీసీ ఆర్‌ఎంటీలు దుర్గారావు, శ్రీనివాసరాజు అభినందనలు తెలిపారు.

సంపూర్ణ పోషణ

- అంగన్‌వాడీల్లో పోషణ వాటికలు
- సేంద్రియ విధానంలో ఆకుకూరలు, కూరగాయల సాగు
- గర్భిణులు, బాలింతలకు ఉచితంగా పంపిణీ



రంగంపేట అంగన్‌వాడీ కేంద్రంలోని పోషణ వాటికలో పెంచిన ఆకుకూరలు

రంగంపేట: రసాయన ఎరువులు, పురుగు మందుల అవశేషాలు లేని పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలకు అందించాలనే ఉద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషణ వాటికలను ఏర్పాటు చేసి ఆకు కూరలు, కూరగాయలు పండిస్తున్నారు. వాటిలో పండించిన ఆకు కూరలు, కూరగాయలను ఆయా కేంద్రాల పరిధిలోని గర్భవతులు, బాలింతలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు వండి పెడుతున్నారు. సేంద్రియ ఎరువులు వినియోగించి ఈ ఆకు కూరలు, కూరగాయలు పండిస్తున్నారు.

ఐసీడీఎస్ శ్రీకారం

2025–26 సంవత్సరానికి అవసరమైన ఆకు కూరలు, కూరగాయల సాగుకు ఐసీడీఎస్ అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఆరు సెంట్లకు తగ్గకుండా భూమిని ప్రభుత్వం లేదా ప్రైవేట్ వ్యక్తుల సహకారంతో సేకరిస్తారు. ఆ భూమిలో మడులు కట్టి వివిధ రకాల ఆకు కూరలు, కూరగాయలు పండిస్తున్నారు. రంగంపేట ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్ వాడీ కేంద్రాల వద్ద పండించిన ఆకు కూరలను గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్నారు.



రంగంపేటలో గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలు పంపిణీ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పోషణ వాటికల ఏర్పాటు

రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో 184 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 66 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. సొంత భవనాలు గల కేంద్రాలకు పోషణ వాటిక ఏర్పాటు చేసి ఆ గ్రామంలోని అన్ని కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులకు పండించిన ఉత్పత్తులను పంపిణీ చేస్తారు. ఈ 66 కేంద్రాల పరిధిలో సుమారు నాలుగు ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు.

నిధుల విడుదల

పోషణ వాటికల ఏర్పాటుకు ప్రభుత్వం ఒక్కొక్క అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10 వేలు చొప్పున నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో విత్తనాల కొనుగోలు, వాటికల తయారీ, నీటి సదుపాయం వంటి వాటిని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు సమకూర్చుకోవాలి. పండించిన పంటలను ఉచితంగా బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేయడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు వండి పెట్టాలి. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో పంటలు పండించాలి. వాటికల ఏర్పాటు కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల సమీపంలోని ప్రభుత్వ భూములను, డంపింగ్ యార్డులు కేటాయించింది. ప్రభుత్వ భూములు అందుబాటులో లేని గ్రామాల్లో రైతులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో స్థలాలను తీసుకుని పంటలు సాగు చేస్తున్నారు.

సాగు చేసే పంటలివే..

కొత్తిమీర, గోంగూర, పాలకూర, చుక్కకూర, మెంతికూర, తోటకూర, వంగ, టమాటా, బీర, దోస, గోరు చిక్కుడు, ఆనబ, గుమ్మడి, వంటి పంటలను పండిస్తున్నట్టు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆకు కూరలు సిద్ధంగా ఉన్నాయి. అనపర్తి మండలంలో 21, బిక్కవోలు మండలంలో 23, రంగంపేట మండలంలో 22 పోషణ వాటికలు ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఆ వాటికలను పర్యవేక్షిస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారుల సూచనలు, సలహాలను తీసుకుని పంటలను పండిస్తున్నట్టు సీడీపీఓ జెస్సీ ఫ్లోరెన్స్ తెలిపారు.

సేంద్రియ పద్ధతిలో సాగు



రసాయన, క్రిమిసంహారక మందులు వాడకుండా పూర్తిగా సేంద్రియ ఎరువులను వినియోగించి ఆకు కూరలు, కూరగాయలు పండిస్తున్నాం. ప్రతి పోషణ వాటికకు ప్రభుత్వం రూ.10 వేలు మంజూరు చేసింది. ప్రాజెక్టు పరిధిలో 66 కేంద్రాలకు రూ.6.60 లక్షలు మంజూరయ్యాయి. పోషణ వాటికలను ఏర్పాటు చేశాం. పండించిన వాటిని బాలింతలు, గర్భిణులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.

– జె. జెస్సీఫ్లోరెన్స్, సీడీపీఓ, రంగంపేట

హోమియోపతి వైద్యశిబిరం



రోగులకు మందులు అందిస్తున్న వైద్యుడు

సీతానగరం: అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో రామచంద్రపురంలో సోమవారం హోమియోపతి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారికి డాక్టర్ షేక్ సైద్ అహ్మద్ సేవలందించారు. వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కమ్యూనిటీ జిల్లా అధ్యక్షుడు షేక్ సుల్తాన్ మాట్లాడుతూ అందరిని ప్రేమించు, ఎవ్వరినీ ద్వేషించకు అనే నినాదంతో హ్యూమానిటీ ఫస్ట్ శాఖ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలనునిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ గ్రామ అధ్యక్షుడు మస్తాన్ సాహెబ్, సత్తిబాబు, శ్రీను, మహ్మద్ అక్బర్, తారప్ మహ్మద్ పాల్గొన్నారు.

రెండు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు వచ్చాయి. కొత్త పింఛన్ కోసం సీతానగరానికి చెందిన వెలుగుల నూకమణి, ఉమ్మడి దారి స్థలాన్ని ఆక్రమించి గోడ కడుతున్నారంటూ రఘుదేవపురానికి చెందిన సుంకర సతీష్ కుమార్ అర్జీలు అందించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ఎస్ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డికి మాజీ ఎమ్మెల్యే దంపతుల పరామర్శ



బాపాయమ్మ చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

పెదపూడి: అనపర్తి మండలం రామవరంలో గ్రామంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, గ్రామ ఉప సర్పంచ్ సబ్బెళ్ల కృష్ణారెడ్డిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు సోమవారం పరామర్శించారు. కృష్ణారెడ్డి తల్లి బాపాయమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె పెద్దకర్మను సోమవారం నిర్వహించారు. ఆ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే దంపతులు హాజరయ్యారు. బాపాయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ బాపాయమ్మ కాంగ్రెస్ తరఫున గ్రామ పంచాయతీ వార్డు మెంబర్‌గా పనిచేశారన్నారు. తల్లిని ఆదర్శంగా తీసుకుని కృష్ణారెడ్డి ఒక రాజకీయ శక్తిగా ఎదిగారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తుల రమణ, కేతా శ్రీను, సత్తి గీతా వరలక్ష్మి, సత్తి సుబ్బిరెడ్డి, పాలమూరు ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి పాల్గొన్నారు.

నేడు రాజానగరంలో జాబ్ మేళా

రాజానగరం: ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డిపార్టుమెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ఎంబీఏ, ఫార్మసీ కోర్సులు పూర్తి చేసిన 19 ఏళ్ల నుంచి 29 ఏళ్ల లోపు యువతీ యువకులు అర్హులని స్థానిక స్కిల్ హాబ్ ప్రతినిధి గోపాల్ తెలిపారు. ప్రముఖ మూడు కంపెనీల ప్రతినిధులు హాజరై తమకు అవసరమైన 82 మంది ఉద్యోగులను ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు తమ విద్యార్హతలు, అనుభవానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకే ఎంపీడీఓ కార్యాలయానికి రావాలని కోరారు.

ఉత్సాహంగా ఓపెన్ డే కార్యక్రమం



ఎన్ఎస్ఎస్ విభాగం గురించి వివరిస్తున్న ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సుధామయి

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో సోమవారం ఓపెన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కళాశాలను జూనియర్ కాలేజీ విద్యార్థులు సందర్శించారు. కంప్యూటర్, ఫిజిక్స్, జువాలజీ, ఇంగ్లీష్ లాబ్‌లు, గ్రంథాలయం, మైదానం, జిమ్, ఎకనామిక్స్, మ్యాథ్స్, కామర్స్, పాలిటిక్స్, చరిత్ర, తెలుగు శాఖ, ఎన్ఎస్ఎస్, ఉమన్ ఎంపవర్మెంట్ సెల్ ఆక్టివిటీస్ పనితీరును ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు, అధ్యాపకులు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు వీవీ సుబ్బారావు, డాక్టర్ నాగేశ్వరరావు, ఎం.సుధామయి, డాక్టర్ మాధవ్, అలేఖ్య, వెంకటేష్, మీనాక్షి, వాణి, ఫణీంద్ర, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ టోర్నీ విజేతగా 'రామచంద్రపురం'





మెన్, వుమెన్ విజేతలుగా నిలిచిన రామచంద్రపురం జట్లు

- మెన్, వుమెన్ విభాగాల్లో విజయకేతనం
- విన్నర్లకు బహుమతుల ప్రదానం

పెదపూడి: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జి.మామిడాడ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి గౌరీ శంకర్‌రెడ్డి అన్నారు. ఆ గ్రామంలో రెండ్రోజులు జరిగిన అండర్ – 23 బాస్కెట్‌బాల్ అసోసియేషన్ మెన్, ఉమెన్ క్రీడాపోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఫైనల్‌లో టోర్నమెంట్ చాంపియన్లుగా మెన్, వుమెన్ విభాగాల్లో రామచంద్రపురం జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా గౌరీ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సత్తి నర్సిరెడ్డి మెమోరియల్ జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ మెన్, ఉమెన్ అండర్– 23 ఉత్సాహంగా జరిగాయన్నారు. ఫ్లడ్‌లైట్ కోర్టులో హోరాహోరిగా జరిగిన పోటీల్లో మెన్, వుమెన్ కేటగిరీల్లో రామచంద్రపురం జట్లు విన్నర్‌గా, డీఎస్‌ఏ కాకినాడ రన్నర్‌గా, గొల్లల మామిడాడ తృతీయ స్థానాల్లో నిలిచాయన్నారు. అమ్మిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ద్వారంపూడి వెంకటరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, సబ్బెళ్ల రామలక్ష్మణరెడ్డి, పడాల రాజబాబురెడ్డి, ద్వారంపూడి మురళీ శ్రీనివాసరెడ్డి, మేడపాటి హరనాథ్‌రెడ్డి, యూఎస్‌ఏ తాతారెడ్డి, శివరామ్ యూత్ తదితరులు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. బీఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ యువత రాణించాలన్నారు. దాతలను అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జుత్తక సూర్యకుమారి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తమలంపూడి శివరామారెడ్డి, రావాడ నాగు, వివిధ జిల్లాల బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు మణిక్యాలరావు, రుద్ర, స్థానిక బాస్కెట్ బాల్ గౌరవ అధ్యక్షుడు నల్లమిల్లి అప్పారెడ్డి, కార్యదర్శి చిర్ల వెంకటకృష్ణారెడ్డి, కోశాధికారి ద్వారంపూడి యువరాజారెడ్డి, బాలుర ఉన్నత పాఠశాల పీడీ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

- ఎంపీపీ కేతా తులసి
- పెదపూడి మండల పరిషత్ సమావేశం



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా తులసి

పెదపూడి: అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు పరస్పర సహకారంతో పనిచేయాలని ఎంపీపీ కేతా తులసి అన్నారు. ఆమె అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. బాధ్యత రాహిత్యంగా వ్యవహరించే వారిపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందుగా విద్యాశాఖ, పశువైద్యం తదితర శాఖల ప్రగతిని అధికారులు వివరించారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఇల్లు నిర్మించుకునే వారికి రుణం మంజూరు చేస్తుందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏఓ మణిదీప్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంటల బీమా నమోదు చేయించుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో గోకులాలు ఇప్పటికే నిర్మాణంలో ఉన్నాయన్నారు. రూ.3.49కోట్లు సీసీ రోడ్లు నిర్మాణాలు పూర్తి చేశారన్నారు. ఏపీత్రయం, సంపర గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు సరఫరా చేయాలని ఎంపీటీసీ సభ్యులు శ్రీరామచంద్రమూర్తి, పెండెం జ్ఞాన ప్రసూన అధికారులను కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక పదార్థాలు, ఇతర కార్యక్రమాలు ఏమి జరిగినా సంబంధిత ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని పైన గ్రామ ఎంపీటీసీ సభ్యుడు సుందరపల్లి సుధాకర్‌బాబు కోరారు. అలాగే అన్ని శాఖల ఆయా శాఖల పని తీరు వివరించారు.

అంచనా బడ్జెట్ ఆమోదం

మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే అన్ని రకాల ఆదాయాల ప్రకారం 2025–2026 సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్‌కు సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపింది. అన్ని రకాల ఆదాయం మొత్తం రూ.28,60,00,000 కాగా, ఖర్చులు రూ.28,59,40,000 కాగా, మిగులు బడ్జెట్ రూ.60 వేలుగా ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ కర్రెడ్ల వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరం



పెద్దాడలో ప్రజలకు డస్ట్‌బిన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మీనాక్షి

పెదపూడి: గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరమని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెద్దాడ గ్రామంలో సర్పంచ్ దొకుబుర్ర మీనాక్షి అధ్యక్షతన గ్రామాభివృద్ధి ప్రణాళికలపై సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఏడాదికి గ్రామ పంచాయతీ చేపట్టే పనుల ప్రణాళికలకు ప్రజా భాగస్వామ్యంతో వచ్చే ఆదాయం, ఎన్ఆర్ఈజీఎస్ తదితర గ్రాంట్లు మ్యాచింగ్ మొత్తం జమలు, అలాగే జరగబోయే ఖర్చులు చదివి వినిపించి ప్రజా ఆమోదంతో గ్రామ సభ నిర్వహించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం ప్రజలు డస్ట్‌బిన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి మన్యం శ్రీనివాసు చౌదరి, గ్రామ పెద్దలు వీరభద్రం, కాశీ, వీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలాన్ని హైస్కూల్‌కు కేటాయించడం తగదు



తహసీల్దార్ అనసూయకు వినతి పత్రం అందిస్తున్న వెంకటరమణ తదితరులు

రంగంపేట: హైస్కూల్ నిర్మాణానికి శ్మశాన స్థలం కేటాయిస్తే సహించేది లేదని ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ కుందేటి వెంకట రమణ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో తహసీల్దార్ కోసు అనసూయకు వినతిపత్రం అందించారు. పాతకోటపాడులోని సర్వే నంబరు 44లో 2.71 ఎకరాలను గత 60 ఏళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ సామాజిక వర్గాలు శ్మశానంగా వినియోగించుకుంటున్నాయన్నారు. ఇటీవల కొందరు తప్పుడు రిపోర్టులు సమర్పించారు. దీన్ని హైస్కూల్ నిర్మాణానికి కేటాయించడం తగదన్నారు. అధికారులు తక్షణమే విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



కోరుకొండలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, పోలీసులు

మధురపూడి: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కోరుకొండలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ప్రభుత్వోన్నత పాఠశాల వరకూ ఈ కార్యక్రమం జరిగింది. రోడ్డు భద్రతను తీసుకుందాం, ప్రమాదాలను అదిగమిద్దాం, హెల్మెట్‌ను ధరిద్దాం, రక్షణకు ప్రాధాన్యమిద్దాం అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐ సత్య కిషోర్ మాట్లాడుతూ ఎస్పీ నరసింహ కిషోర్, డీఎస్పీ వై.శ్రీకాంత్ ఆదేశాలపై ఈ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. ఈ నెల 10న ప్రారంభమైన భద్రతా మాసోత్సవాలు ఫిబ్రవరి 10 వరకూ జరుగుతాయన్నారు. డ్రైవింగ్‌లో నిబంధనలను పాటించాలన్నారు. మోటారు సైకిళ్లపై ట్రిబుల్ రైడింగ్ వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వాహనచోదకులందరూ రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై పి.శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న తిరుకల్యాణం



తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న కామిని ప్రసాద్ చౌదరి, లక్ష్మి దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వెంకటగిరికొండపై కొలువైన లక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామివారి 25వ తిరు కల్యాణ మహోత్సవాన్ని సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణ కర్తలుగా ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త కామిని ప్రసాద్ చౌదరి, లక్ష్మి దంపతులు వ్యవహరించారు. శైవగామ పండితుడు సూరిపండు, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకృష్ణ పరమాత్మ.. స్వామి వారి కల్యాణాన్ని వేడుకగా జరిపించారు. తొలుత మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా కోలాట నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కల్యాణ మహోత్సవాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ మత్సేటి ప్రసాద్ తదితరులు తిలకించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న గోదావరి జిల్లాల్లోని కళాశాలల యాజమాన్య ప్రతినిధులు యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ హాలులో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహ్మద్ హబీబ్ బాషా, గౌరవాధ్యక్షుడిగా గంధం నారాయణరావు, కార్యదర్శిగా ఎస్.కనకయ్య, ఉపాధ్యక్షులుగా జి.బ్రహ్మజీ, ఆకుల నాయుడు, కోశాధికారిగా ఎం.నాగబాబును ఎన్నుకున్నారు.

పశువుల సంరక్షణ కోసమే వైద్యశిబిరాలు



జంబూపట్నంలో నట్టల వ్యాధి నివారణ మందులను అందజేస్తున్న వైద్యులు

మధురపూడి: పాడి పశువులకు వ్యాధులు సోకకుండా సంరక్షించడానికి పశు వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్టు కోరుకొండ ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్యసూర్యకుమారి తెలిపారు. కోరుకొండ మండలం జంబూపట్నంలో సోమవారం నిర్వహించిన శిబిరానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశు గణన సక్రమంగా నిర్వహిస్తే రైతన్నలకు మేలు జరుగుతుందన్నారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పి. ప్రభావతి పశువులకు నట్టల నివారణ మందు వేశారు. డాక్టర్లు వనిత, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

రఘుదేవపురంలో..

సీతానగరం: రఘుదేవపురంలో నిర్వహించిన పశు వైద్య శిబిరంలో 46 మంది పాడి రైతులకు సంబంధించిన 66 పశువులకు, 250 జీవాల (మేకలు, గొర్రెలు)కు మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఎ.ఫణీంద్ర వైద్య సేవలు అందించారు. దాసరి రమేష్, కవల గంగాధర్, చుండ్రు సత్య ప్రసాద్, పెందుర్తి విజయ్ భాస్కర్, బొమ్మిరెడ్డి సూరిబాబు, తన్నీరు సుబ్బారావు, ఉండవల్లి తాతారావు పాల్గొన్నారు.

ఆరికరేవుల గ్రామంలో..

బిక్కవోలు: ఆరికరేవుల గ్రామంలో నిర్వహించిన పశువైద్యశిబిరంలో 45 పశువులకు వైద్యం అందించారు. డాక్టర్ ప్రణీత్ మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు జరిగే ఈ శిబిరాల్లో అనారోగ్యం బారిన పడిన పశువులు చికిత్స అందించడంతో పాటు వ్యాధులు రాకుండా ముందస్తు టీకాలు వేస్తున్నామన్నారు. అనంతరం పాడి రైతులు మందులను అందజేశారు. సర్పంచి రెడ్డి నాగవేణుకుమారి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శ్రీను, ఎంపీటీసీ కొర్ల చక్రధరరావు, డాక్టర్ రవికుమార్, వీర్రాజు పాల్గొన్నారు.